వికసించిన విద్యాకుసుమాలు

ప్రణాళికాబద్ధంగా చదివి, పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన ఆ విద్యార్థులు ట్రిపుల్ ఐటీలకు అర్హత సాధించారు. పట్టుదల ఉంటే చాలు, పేదరికం అడ్డు కాదని నిరూపిస్తూ ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకున్నారు.

గాజువాక/పెదగంట్యాడ/అగనంపూడి: ట్రిపుల్ ఐటీలకు గాజువాక నియోజకవర్గ చిన్నారులు అర్హత సాధించారు. పదో తరగతిలో అత్యుత్తమ మార్కులను సాధించి ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ చదివేందుకు వివిధ ట్రిపుల్ ఐటీల్లో అడ్మిషన్లు పొందారు. ఒక్క గాజువాక మండలం నుంచే ఆరుగురు విద్యార్థులు ఈ ఏడాది అడ్మిషన్లు పొందడం విశేషం. గాజువాక నియోజకవర్గంలో ఏడు జిల్లా పరిషత్ హైస్కూళ్లున్నాయి. వాటిలో గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి ముగ్గురు విద్యార్థులు, కణితి జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి ఇద్దరు విద్యార్థులు, అగనంపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి ఒక విద్యార్థి ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలను సాధించారు. గాజువాక హైస్కూల్‌కు చెందిన మడక తేజశ్రీ ఒంగోలు ట్రిపుల్ ఐటీలోను, పట్నాన అంజలి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో, పి.బాలపరిమళ ఒంగోలు ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలు పొందినట్టు ప్రధానోపాధ్యాయిని విజయ ప్రశాంతి తెలిపారు.

ట్రిపుల్ ఐటీలకు విద్యార్థుల ఎంపిక


మడక తేజశ్రీ, (ఒంగోలు ట్రిపుల్ ఐటీ)


పి. అంజలి (శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ)


బాలపరిమళ (ఒంగోలు ట్రిపుల్ ఐటీ)

కార్పెంటర్ కుమార్తెకు అడ్మిషన్

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి పెదగంట్యాడ మండలంలోని, నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎంపికైంది. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో గాయత్రి రమ్య 574 మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్ పొందింది. మండలంలోని వెంపళ్లనగర్‌కు చెందిన గాయత్రి రమ్య తండ్రి చిన్నారావు కార్పెంటర్ పనులు చేస్తుంటారు. తల్లి సత్యవతి ఇంట్లో టైలరింగ్ పనులు చేస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా..



సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలన్నది నా లక్ష్యం. నడుపూరు హైస్కూల్లో టెన్త్ క్లాస్ చదివాను. హెచ్‌ఎం ప్రత్యేక శ్రద్ధ, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో టెన్త్ క్లాస్‌లో మంచి మార్కులు సాధించడంతో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. అమ్మానాన్నలు ఎంతో కష్టపడి చదివిస్తున్నారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా మంచి ఉద్యోగంలో స్థిరపడాలి. వారిని బాగా చూసుకోవాలి. – అలమండ గాయత్రిరమ్య (శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ)

కంప్యూటర్ ఇంజినీర్ కావాలని..



పదో తరగతిలో 574 మార్కులతో పాఠశాలలో టాపర్‌గా నిలిచాను. ఐఐఐటీ శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీర్ కావాలనేది నా ఆకాంక్ష. మా నాన్న రాము దువ్వాడ వీఎస్‌ఈజెడ్‌లోని ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నారు. అమ్మ ఇంటి పనులు చేసుకుంటుంది. అమ్మా నాన్న, పాఠశాల ఉపాధ్యాయుల సహాయ సహకారాలతోనే ఈ విజయం సాధ్యమైంది.
– కె.ఎస్.కె.మహాలక్ష్మి (ట్రిపుల్ ఐటీ, శ్రీకాకుళం)

అమ్మ నాన్నల ఆకాంక్షలు నెరవేర్చాలి



నాకు ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో సీటు వచ్చింది. టెన్త్ క్లాస్‌లో 573 మార్కులు వచ్చాయి. పదో తరగతి పరీక్షల్లో ఉపాధ్యాయుల గైడెన్స్ బాగా ఉపయోగపడింది. వారి ప్రోత్సాహంతోనే ఇదంతా సాధ్యమైంది. మా నాన్న అప్పారావు పెయింటింగ్ పనులు చేస్తారు, అమ్మ ఇంటి పనులు చేస్తుంది. నన్ను బాగా చదివించి, ఉన్నత స్థానంలో చూడాలనేది వారి ఆకాంక్ష. మంచి ఉద్యోగం సాధించి అమ్మనాన్నలకు మంచి పేరు తేవాలి.
– దాసరి అరుణ,(ట్రిపుల్ ఐటీ, శ్రీకాకుళం)

ప్రభుత్వ కొలువే లక్ష్యం



నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగం సంపాదించడం లక్ష్యంగా పెట్టుకున్నాను. అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 584 మార్కులు సాధించాను. గాజువాక మండలాని టాపర్‌గా నిలవడం ఆనందాన్ని ఇచ్చింది. నాన్నగారు మార్బుల్, గ్రానైట్ పనులు చేస్తుంటారు. అమ్మ ఇంటి పనులు చేస్తుంటారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సీటు అలాట్ అయినందుకు సంతోషంగా ఉంది.
– వన సాహితి (నూజివీడు ట్రిపుల్ ఐటీ)

అందరి ప్రోత్సాహంతో..



నేను లంకెలపాలెం హైస్కూల్లో చదివాను. టెన్త్‌లో 570 మార్కులు వచ్చాయి. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సీటు వచ్చింది. నాన్న వెల్డర్, అమ్మ గృహిణి. పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో టెన్త్‌లో మంచి మార్కులు రావడంతో నాకు ఈ సీటు వచ్చింది. కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీర్ కావాలని ఆకాంక్ష. వీలైతే ఎంటెక్ చేసి, మంచి ఉద్యోగం సాధించి, అమ్మా నాన్నలను బాగా చూసుకోవాలి.
-జి.హెచ్.ఎస్.ఎస్.వర్ధన్ (శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ)

క్లుప్తంగా

స్వర్ణాలంకరణలో జగన్నాథస్వామి


స్వర్ణాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన జగన్నాథస్వామి

అగనంపూడి: జగన్నాథస్వామి స్వర్ణాలంకరణలో దర్శనమిచ్చారు. అగనంపూడి సత్రం కూడలిలోని జగన్నాథస్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామికి దర్పణ స్థానం, అర్చనలు చేసిన అనంతరం స్వామిని అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు కరణం పైడిరాజు, గొల్లవిల్లి కనక భవానీ, మాజీ చైర్మన్ గొల్లవిల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ ఆటోల బంద్

గాజువాక: తమ జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ గాజువాక జోన్‌లోని క్లాప్ ఆటో డ్రైవర్లు బంద్ చేశారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో వారు ఆందోళన నిర్వహించారు. ఈ నెల పదో తేదీ నాటికి జీతాలు చెల్లిస్తామని చెప్పిన అధికారులు గానీ, కాంట్రాక్టరు గాని తమ జీతాలను చెల్లించలేదని, ఈఎస్ఐ, ఈపీఎఫ్‌కు సంబంధించిన డ్రైవర్ల వాటా సొమ్మును జీతం నుంచి మినహాయిస్తున్నప్పటికీ ఈఎస్ఐ, ఈపీఎఫ్‌లకు చెల్లించడం లేదంటూ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జీతాలు చెల్లించేవరకు వాహనాలను తిరగనివ్వమని స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన అధికారులు జీతాలను గురువారం చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికురాలి తొలగింపు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో ఏళ్ల నుంచి తిష్టవేసి, నిర్వాసితులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఒప్పంద కార్మికురాలిని విశాఖ జాయింట్ కలెక్టర్ తొలగించారు. ఎస్డీసీ కార్యాలయంలో దీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న రాజేశ్వరి, దందాలు చేసే బ్రోకర్లకు పెద్ద పీట వేస్తూ, నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నారని ఇటీవల సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన అధికారుల నివేదిక మేరకు రాజేశ్వరిని విధుల నుంచి తొలగించారని రామ అప్పారావు పేర్కొన్నారు.

భారీ అన్నసమారాధన


సమారాధనలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-9 గురజాడ కళాక్షేత్రంలో బుధవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. జగన్నాథస్వామి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉత్కళ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో సుమారు 10 వేల మంది అన్న ప్రసాదం స్వీకరించారు. ఉత్కళ అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ సామాజిక సంస్థల ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం పలువురు విరాళాలు అందజేశారు. ఆనందపురం గ్రామ సర్పంచ్ చందక లక్ష్మి, సూరిబాబు దంపతులు రూ.1.10 లక్షలను ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్‌కు, నగరంలోని మహారాణిపేటకు చెందిన వి.సూర్య ఉమాభారతి అనే దాత రూ.లక్ష విరాళ చెక్కును అన్నప్రసాద విభాగం ఏఈవో పాలూరి నరసింగరావుకు అందించారు. దాతలకు స్వామివారి దర్శనం కల్పించి, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ప్రసన్న వేంకటేశ్వరుడికి తిరుప్పావడ సేవ

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు


ప్రసన్న వేంకటేశ్వరాలయంలో స్వామికి నివేదించిన పులిహోర రాశి

అక్కిరెడ్డిపాలెం: తొలి ఏకాదశిని పురస్కరించుకుని బెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరాలయంలో బుధవారం అన్నకూటోత్సవం నిర్వహించారు. పులిహోరను రాశులుగా పోసి స్వామికి నివేదించారు.


లక్ష తులసి పత్రి నడుమ వైకుంఠ వేంకటేశ్వరుడు

- షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమలేశునికి ప్రత్యేక పూజలు చేశారు. తుంగ్లాం కోదండ రామాలయంలో కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి కుటుంబసమేతంగా పూజల్లో పాల్గొన్నారు.

ఉక్కు వెంకన్న ఆలయంలో..

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-1లోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఉదయం 9 గంటలకు భగవద్గీత పారాయణం, సాయంత్రం నాలుగు గంటల నుంచి విష్ణు సహస్రనామ పారాయణం చేశారు.

- బీసీ గేటు శివాలయం ఆవరణలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ప్రాంగణంలోని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

లక్ష తులసి పత్రి పూజ

పెదగంట్యాడ: వాంబే కాలనీ కొండపై కొలువుదీరిన వైకుంఠ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం లక్ష తులసిపత్రి పూజ చేశారు. ఆలయ ధర్మకర్త మంత్రి ముంజుల, ఆలయ కమిటీ అధ్యక్షుడు దొడ్డి రమణ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.నెల్లిముక్కు రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.


ఉక్కు వేంకటేశ్వస్వామి ఆలయంలో విష్ణు సహస్రనామ పారాయణం చేస్తున్న భక్తులు

వైభవంగా స్వామి కల్యాణోత్సవం

అగనంపూడి: 87వ వార్డు వడ్లపూడి లక్ష్మీపురం కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజల అనంతరం శ్రీవారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ, వికాస్ తరంగణి, అన్నదాన కమిటీల ప్రతినిధులు సేవలు అందించారు.

- 88వ వార్డు జగ్గరాజుపేట సమీపం గ్రీన్‌సిటీలోని శ్రీలక్ష్మి అండాళ్ సమేత వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ప్రత్యేక పూజలు చేశారు.
- 85వ వార్డు అగనంపూడి శాంతినగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు తెల్లవారుజాము నుంచి దీపారాధన చేశారు.


రాజులపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామి

సేవలతోనే గుర్తింపు


స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎం సంజీవరావును సత్కరిస్తున్న జీఎం భాను, నాయకులు

ఉక్కునగరం: విధి నిర్వహణలో చేసిన సేవలు గుర్తింపు ఇస్తాయని స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎం ఎస్. భాను అన్నారు. ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న జీఎం (ఐఆర్) కె. సంజీవరావును విస్తృత దళిత సంఘాలు (విదసం) ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ సంజీవరావు 34 ఏళ్లుగా స్టీల్‌ప్లాంట్‌లో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి అధికారులు, కార్మికుల మన్ననలు పొందారన్నారు. సన్మానగ్రహీత సంజీవరావు మాట్లాడుతూ ఏ సంస్థ అభివృద్ధి చెందాలన్నా టీమ్ వర్కే మాస్టర్ కీ అన్నారు. కార్యక్రమంలో విదసం రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు, వివిధ సంఘాల నాయకులు ఎల్లేటి శ్రీనివాస్, కె.రాజబాబు, బయ్యే మల్లయ్య, జి.ఆనంద్, పి. భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డీసీపీ-2 తుహిన్ సిన్హా బాధ్యతల స్వీకరణ


డీసీపీ 2 తుహిన్ సిన్హా

అక్కిరెడ్డిపాలెం: డీసీపీ-2 తుహిన్ సిన్హా గాజువాక పోలీస్ స్టేషన్‌లో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. గంజాయిని రవాణా చేసినా, తరలించినా కఠిన చర్యలు తప్పవన్నారు. గంజాయి, డ్రగ్స్ సరఫరాకు సంబంధించి పాఠశాలలు, కాలేజీలపై నిఘా పెడతామన్నారు. గంజాయి రవాణా రైడ్స్‌లో పట్టుబడితే వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, వారిలో పరివర్తన తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. వైఎస్సార్ జిల్లాలో పనిచేసే సమయంలో గంజాయి రవాణా, వినియోగాన్ని 90 శాతం నియంత్రించామని చెప్పారు. సిన్హాకు గాజువాక సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, క్రైం ఏసీపీ శ్యామలరావు, గాజువాక లా అండర్ ఆర్డర్ సీఐ ఎం.శ్రీనివాసరావు, క్రైం సీఐ ఎస్.శ్రీనివాసరావు పుష్ప గుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలిపారు.

డీసీపీకి అభినందనలు

ఉక్కునగరం: డీసీపీ తుహిన్ సిన్హాను స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా సిన్హా మాట్లాడుతూ ప్లాంట్‌లో శాంతిభద్రతల సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా బదిలీపై అమరావతి వెళ్తున్న డీసీపీ మోకా సత్తిబాబును వారు సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, ఎస్.మోహన్‌బాబు, అంజిబాబు, సాయి ప్రసాద్, జె.వి.రావు, బి. అరవిందకుమార్ పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్ల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యే పల్లాకు వినతి పత్రం అందజేస్తున్న అప్సా నాయకులు

గాజువాక: రాష్ట్రంలో చిన్న ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ పాఠశాలల సంఘం (అప్సా) ఉత్తరాంధ్ర జిల్లాల నాయకులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. పాఠశాలల గుర్తింపు రెన్యువల్ కాలపరిమితిని గతంలో మాదిరిగా పదేళ్లకు పొడిగించాలని, విద్యా హక్కు చట్టం ద్వారా గత మూడేళ్లనుంచి ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత అడ్మిషన్లు విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని అప్సా నాయకులు తెలిపారు. వినతి పత్రం సమర్పించినవారిలో నాయకులు ఎం.జనార్థన్, టి.సింహాచలం, పి.భాస్కరరావు, రామకృష్ణ, గణపతిరావు, సత్యం, మురళి, శ్రీనివాస్, రమేష్ తదితరులున్నారు.

‘బీజేపీ నాయకులకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలి’

గాజువాక: రాష్ట్ర ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో బీజేపీ నాయకులకు అవకాశం కల్పించాలని ఆ పార్టీ నాయకులు గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కోరారు. ఈ మేరకు బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు పల్లాను కలిసి వినతి పత్రం సమర్పించారు. దీనిపై పల్లా సానుకూలంగా స్పందించారని, వార్డుల వారీగా బీజేపీ నాయకుల పేర్లు ఇవ్వాలని అడిగారని కరణంరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు ములకలపల్లి ఈశ్వరరావు, బొండా ఎల్లాజీరావు, పి.నాగేశ్వరరావు, కోసూరి తాతారావు, ములకలపల్లి ప్రకాష్ తదితరులున్నారు.

ప్రజా ప్రతినిధుల తీరు బాధాకరం

‘ఉక్కు’ పరిస్థితి అగమ్యగోచరం


దీక్ష శిబిరంలో పాల్గొన్న కార్మిక నాయకులు

అగనంపూడి: సార్వత్రిక ఎన్నికల తరువాత ఎన్నికైన ప్రజా ప్రతినిధుల తీరు బాధాకరంగా ఉందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఎస్.రామారావు, శ్రీనివాస నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెంలో ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు బుధవారానికి 1252వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో పాల్గొన్న వారు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రకటనలకే పరిమితం కావడంతో కార్మికుల్లో ఆందోళన నెలకొందన్నారు. కేంద్ర మంత్రి రెండు మాసాల్లో ఉక్కుకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని, ఉత్పత్తికి కావల్సిన వనరులు కల్పిస్తామని ప్రకటించారని, కానీ ఆ దిశగా కనీసం అడుగులు పడకపోవడంతో వారిలో ఆందోళన అధికమవుతోందన్నారు. ఈ పరిణామాల వల్ల విశాఖ ఉక్కు పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. నాయకులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు ఆదినారాయణ, వి.శ్రీనివాసరావు, శ్రీనివాస్, నరసింగరావు, వై.ఎల్.నాయుడు, మోహిద్దీన్, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన అధికారిపై విమర్శలు బాధాకరం


మాట్లాడుతున్న సురేష్‌బాబు

ఉక్కునగరం: దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి వ్యక్తిగత జీవితాన్ని రాజకీయ రచ్చ చేయడం బాధాకరమని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి లింగాల రవీంద్రబాబు అన్నారు. బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ శాంతి వ్యక్తిగత జీవితంపై మీడియా, సామాజిక మాధ్యమాల్లో వారం రోజులుగా జరుగుతున్న చర్చలు, వ్యాఖ్యానాలు ఆయా వ్యక్తుల దిగజారుడు ప్రవర్తనకు నిదర్శనమన్నారు. న్యాయస్థానాల్లో పరిష్కరించుకోవాల్సిన కుటుంబ సమస్యలపై పత్రికల్లోకి ఎక్కటం శాంతి భర్త మదన్ మోహన్ తప్పన్నారు. శాంతి గిరిజన అధికారి కావడం వల్లే ఈ విధంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై సామాజిక మాధ్యమాల్లో, ఎలక్ట్రానిక్ మీడియాలో ఉన్న వీడియోలు తొలగించాలని వారు డిమాండ్ చేశారు.

శ్రీవిద్య ఉపాసన తరగతులు ప్రారంభం


ఉపాసన తరగతుల్లో పాల్గొన్న దేశ విదేశాలకు చెందిన అభ్యాసకులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠంలో శ్రీవిద్య ఉపాసనలో మిడ్ లెవెల్ కోర్స్ బుధవారం ప్రారంభించినట్టు గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. ఇంగ్లిష్ మీడియంలో ఈ శిక్షణ అందించనున్నట్టు చెప్పారు. దేశ విదేశాల నుంచి వచ్చిన 16 మంది విద్యార్థులకు అన్నపూర్ణమ్మ చేతుల మీదుగా గురు మంత్ర దీక్ష ఇచ్చి తరగతులు ప్రారంభించారు. దీక్షలో సౌదీ అరేబియా, యూఎస్ఏలతోపాటు దేశంలోని వివిధ నగరాల నుంచి వచ్చిన వారు పాల్గొన్నారు.

రోటరీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేసిన రోటరీ క్లబ్ ప్రతినిధులు

గాజువాక: గాజువాక స్టీల్‌సిటీ రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్ష కార్యదర్శులుగా బాసంగి తిరుపతి రావు, జి.రామునాయుడు, కోశాధికారిగా బి.శ్రీనివాసరావుతో ఆ సంస్థ అసిస్టెంట్ గవర్నర్ కె.మురళీకృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నిరాధార పిల్లలకు రూ.5వేల ఆర్థిక సాయం, పళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ఎగ్జిక్యూటివ్ కె.వై.దాసు, ప్రతినిధులు తెంటు సత్యనారాయణ, కొల్లి సత్యంబాబు, చంద్రశేఖర్, వసంత పటేల్, పి.అప్పన్న, ప్రభాకరరెడ్డి, బలివాడ సత్యారావు, బి.బాల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్ పైకి దూసుకుపోయిన కారు

ఇద్దరికి స్వల్ప గాయాలు


డివైడర్ పైకి దూసుకుపోయిన కారు

అగనంపూడి: గాజువాక నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న కారు స్టీరింగ్ లాక్ కావడంతో డివైడర్ పైకి దూసుకుపోయిన సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధి వడ్లపూడి వంతెనపై జరిగిన సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గాజువాకకు చెందిన మోహన్, ధనలక్ష్మి వదిన, మరిదులు. వారితో పాటు మరో ఇద్దరు కారులో అనకాపల్లి వెళ్తుండగా శ్రీనగర్ దాటిన తరువాత వడ్లపూడి వంతెనపై కారు స్టీరింగ్ పట్టేయడంతో కారు అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకుపోయింది. డివైడర్‌పై నున్న చెట్టును ఢీకొట్టి ఆగిపోయింది. ఈ సంఘటనలో మోహన్, ధనలక్ష్మిలకు స్వల్ప గాయాలు కావడంతో ప్రథమ చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

జీవో 21ని తక్షణమే రద్దు చేయాలి


మాట్లాడుతున్న పడాల గోవింద్

మద్దిలపాలెం: వాహనదారులపై జరిమానాలు విధించే జీవో నంబర్ 21ని తక్షణమే రద్దు చేయాలని ఆటో యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు పడాల గోవింద్ డిమాండ్ చేశారు. మద్దిలపాలెం ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం ఆటో డ్రైవర్ల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నియంత్రణ పేరుతో అధిక జరిమానాలు విధిస్తూ వాహనాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన జీవో 21ని రద్దు చేయాల్సిన అవసరముందన్నారు. ఈ నెపంతో ట్రాఫిక్ పోలీసులు, రవాణ శాఖాధికారులు, వాహన యజమానులు, ఆటో, ట్యాక్సీ డ్రైవర్లపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు, అడ్డూరి శంకర్, ఉపాధ్యక్షుడు లంక గోవింద్, కోశాధికారి ఎస్.మధురెడ్డి, కమిటీ సభ్యులు ఎస్.అప్పలనాయుడు, జి.శ్రీను, పి.కృష్ణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతి


గణేష్ కుమార్ మృతదేహం

అగనంపూడి: ఒడిశా రాష్ట్రానికి చెందిన యువకుడు మూర్ఛవ్యాధితో పాటు గుండెపోటు కారణంగా మృతి చెందిన సంఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దువ్వాడ సీఐ ఎర్రం నాయుడు తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రం ఒడిగి సమీపంలోని సురాయ్‌పూర్ గ్రామానికి చెందిన గణేష్ కుమార్ విశ్వకర్మ (23) ఉపాధి కోసం నెల రోజుల క్రితం అగనంపూడి వచ్చాడు. గణేష్ కుమార్ మిత్రులు అగనంపూడి గళ్లవానిపాలెంలో అన్నపూర్ణ వాషింగ్ సెంటర్‌లో పనిచేస్తున్నారు. గణేష్‌కుమార్‌ను కూడా ఇదే పనిలో చేర్పించారు. దీంతో వారితో కలిసి నివాసముంటున్నాడు. బుధవారం రాత్రి మోటార్ సైకిల్ కడుగుతుండగా, మూర్ఛ వచ్చి పడిపోవడంతో గణేష్ మిత్రులు వెంటనే సమీపంలోని అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మూర్ఛతో పాటు గుండెపోటు రావడంతో మృతి చెందాడని ధ్రువీకరించారు. సంఘటనా స్థలానికి సీఐ ఎర్రం నాయుడు చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు.